మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ఇందిరమ్మ పేరిట పేదలకు ఇల్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

### గ్రామాలలో బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



బీటీ రోడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, నవంబరు 25 ప్రభాతవార్త:** రాజీవ్ గృహ, ఇందిరమ్మ పేరిట, ఇల్లు పేదలకు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని పలు గ్రామాలలో విస్తృతంగా పర్యటించి, బీటి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని, ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించిందని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోతే, మన ప్రజా ప్రభుత్వం ఆ అప్పులకు రూ.6000 కోట్ల మిత్తి కట్టుకుంటూ, ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా హామీలను నెరవేరుస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. అనంతరం బస్వాయిపల్లి గ్రామంలో రెండు కోట్ల 55 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్ నిర్మాణం, అదేవిధంగా గద్దెగూడం గ్రామంలో ఒక కోటి 20 లక్షల నిధులు, చిన్న రాజమూర్ గ్రామంలో 02 కోట్ల నిధులు, నాగారం వద్ద 60 లక్షల నిధులతో బీటీ రోడ్ నిర్మాణాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి,బస్వాయిపల్లి విక్రమ్ రెడ్డి, ఫక్రుద్దీన్, శివకుమార్, గద్దె గూడెం పూర్ణిత, జాఫర్, రాములు, చిన్న రాజమూర్ నాయకులు క్రాంతి కుమార్, భరత్, నాగారం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్‌రెడ్డి

### మహిళలను కోటీశ్వరులను చేయడమే

## ప్రభుత్వ సంకల్పం

- సర్కారు తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 25 ప్రభాతవార్త:**మహిళా సాధికారత సాధనలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ని రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వెలుమ పంక్షన్‌హాల్‌లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 2399 మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను రూ.2, 64,00000/- (రెండు కోట్ల 64 లక్షలు రూపాయల)ను ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో మహిళలకు అన్ని రకాలుగా పెద్దపీట వేస్తుందన్నారు. మహిళా సంఘాల సభ్యుల కోసం బ్యాంకులలో తీసుకున్న రుణాలపై సంఘాలకు వడ్డీ భారం లేకుండా ఈ ప్రభుత్వం వడ్డీ లేని రుణాల క్రింద సభ్యులు కట్టిన వడ్డీని తిరిగి ప్రభుత్వమే క్రమం తప్పకుండా చెల్లిస్తుందని, మరియు – మిగతా4లో..



ఉపాధ్యాయ బృందం

### జాతీయస్థాయి పోటీలకు

## జడ్చర్ల ఉపాధ్యాయులు

**జడ్చర్ల, నవంబరు 25 ప్రభాతవార్త:** అఖిల భారత సివిల్ సర్వీసెస్, తెలంగాణా సచివాలయ ఉద్యోగ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 6,7 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కల్చరల్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించిన జడ్చర్ల ఉపాధ్యాయులు నేషనల్స్ కి ఎంపికయ్యారు. ఈ మేరకు పోటీల ఫలితాలను మంగళవారం నాడు సచివాలయ ఉద్యోగుల సంఘం వెలువరించింది. కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసమే నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నలు మూలల నుండి ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, వాయిద్య సంగీతం, గాత్ర సంగీతం, లఘు నాటికల విభాగాలల్లో ఈ పోటీలు నిర్వహించగా జడ్చర్లకు చెందిన ఉపాధ్యాయ బృందం లఘునాటిక విభాగంలో పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన వారు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. జడ్చర్లకు చెందిన ఉపాధ్యాయులు – మిగతా3లో..

## మహిళల గౌరవాన్ని పెంచుతున్నాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- మహిళా స్వయం
- సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం
- రూ.1 కోటి 84 లక్షల 39 వేల 513
- చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త:** మహిళ అంటే కుటుంబానికి పునాది, సమాజానికి దిశానిర్దేశకురాలు. అటువంటి మహిళల జీవితాల్లో ఆత్మగౌరవం,ధైర్యం, ఆర్థిక స్థిరత్వం, భద్రతను నింపే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మహబూబ్ నియోజక వర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నియోజకవర్గం లోని 1539 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.1,84,39,513 విలువైన వడ్డీలేని రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈ రుణాలు మహిళల చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి యూనిట్లు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేసిన పాలకులు వడ్డీలేని రుణాల పంపిణీని నిలిపివేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని వడ్డీలేని రుణాలను పునఃప్రారంభించిందన్నారు. గత రెండు సంవత్సరాలలోనే జిల్లాలో మహిళలకు సుమారు 21 కోట్ల మేర రుణాలు అందించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిందని తెలిపారు. దీని ద్వారా మహిళలు ఉపాధి, విద్య, వైద్య,దైవ, శుభ కార్యాల కోసం ధైర్యంగా ప్రయాణిస్తున్నారని, రెండు సంవత్సరాలుగా జిల్లాలోనే ఉచిత ఆర్‌టిసి బస్‌లలో ప్రయాణం ద్వారా రూ.1292 కోట్ల మేర లబ్ధి చేకూరడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ద్వారా మహిళల గౌరవాన్ని మరింత పెంచామని, పద్దెనిమిది ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలు కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అన్నారు. మహిళలు చేత నిర్వహించే సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు సొసైటీ ఏర్పాటు జరిగిందని, వీరికి జిల్లా కలెక్టర్ తోడ్పాటు నందించాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళను కేవలం లబ్ధిదారుగా కాకుండా, కుటుంబ ఆర్థిక స్తంభంగా గౌరవిస్తున్నామని స్పష్టం చేశారు. మీరు మాకు ఓటు మాత్రమే కాదు, మా విజయం వెనుక ఉన్న శక్తి మీరే. మిమ్మల్ని మా కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం మా బాధ్యత. మీ అభివృద్ధే మా పరిపాలన ధర్మం" అని ఎమ్మెల్యే భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం విశిష్ట విధానాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఇప్పటి వరకు గత రెండు సంవత్సరాలలో మూడు విడతలుగా వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం పంపిణీ చేసిందని,మొదటి విడతగా రూ.58.90 లక్షలు, రెండవ విడతగా రూ. 9.81 కోట్లు, నేడు మూడవ విడతగా రూ.10.49 కోట్లు జిల్లాలోని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసిందని తెలిపారు. మహిళల గౌరవం పెంచేలా ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేస్తుందని, గ్రామాల్లో 18 సం.లు నిండిన ప్రతి మహిళకు నేటి వరకు పంపిణీ పూర్తి అవుతుందని తెలిపారు. మహిళలు కుటుంబం బాగుకు ఆదాయం కల్పించే కార్యక్రమాలు,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ల ద్వారా పాఠశాలల రిపేర్ పనులు, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫామ్‌లు కుట్టు – మిగతా4లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి

### అవినీతి,అక్రమాలను

## వెలికి తీస్తాం...!!

- సార్‌ను జైలుకు పంపడం ఖాయం...!
- రెండున్నర ఎకరాల భూ కబ్జా నిజం కదా...
- అక్రమాలపై ఎఫ్ఐఆర్‌లు చేయించాం
- దమ్ము, ధైర్యం ఉంటే దేవుని ఎదుట
- అవినీతికి,అక్రమాలకు పాల్పడలేదని ప్రమాణం చేయి

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 25 ప్రభాతవార్త :** అవినీతి అక్రమాలకు పాల్పడ్డ నాయకులు జైలుకు వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 2వ తేది వనపర్తి పర్యటనలో భాగంగా శంకుస్థాపన చేసిన సుమారు రూ.2వేల 25 కోట్ల విలువగల అభివృద్ధి పనులకు (ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్,ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాల, 500ల పడకల ప్రభుత్వ అసుపత్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, మహిళా పాలిటెక్నిక్ వసతిగృహం) మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై నూతన వ్యాయామశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా అయన మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను ఆయన ప్రారంభించారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి మాటున – మిగతా4లో..

## మహిళలు ఆత్మగౌరవంతో బతికేలా రుణాలు సద్వినియోగం చేసుకోవాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల టౌన్ ,నవంబర్ 25, ప్రభాతవార్త:** ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న రుణాలను సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఫలితంగా మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐడిఓసి లోని సమావేశపు మందిరంలో సేర్ప్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అట్టహాసంగా జరిగిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి ఒక్క సభ్యురాలికి గుర్తింపు, గౌరవం ఉండాలని ప్రభుత్వం ఇందిరమ్మ చీరలను అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణాలతో వ్యాపారాలు చేసుకుంటూ, వచ్చిన ఆదాయాన్ని పొదుపు చేస్తూ కుటుంబ అవసరాలకు వినియోగిస్తుండడంతో కుటుంబ నిర్వహణలో మహిళలు కీలక శక్తిగా ఎదుగుతున్నారని కొనియాడారు. పిల్లల పెళ్లిళ్లు చేయడానికి, ఇంటి నిర్మాణాలకు, ఇతర కుటుంబ అవసరాలకు గతంలో ప్రైవేట్ వ్యక్తులతో అప్పులు చేసి వడ్డీలు కట్టేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఆస్కారమేర్పడిందన్నారు. ఇదివరకు కరువు కాటకాలకు నిలయంగా ఉన్న గద్వాల ప్రాంతంలో ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా ఉండడంతో మంచి పంటలు పండుతున్నాయని, ఆ పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళల ద్వారానే ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమని, అందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేలా మహిళలు తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలకు వివిధ వ్యాపార రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు గద్వాలలో మహిళ శిక్షణ కేంద్రం నిర్మాణంలో ఉందని, రెండు నెలల్లోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ గత శనివారం గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సందర్భంగా పలువురు మహిళా సంఘాల సభ్యులు వడ్డీ లేని రుణాలు కావాలని కోరారని, ప్రభుత్వ నిర్ణయంతో త్వరగానే సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాకు మొత్తం 4724 సంఘాలకు రూ.5.10 కోట్ల వడ్డీ లేని రుణాలు రావడం జరిగిందని, ఇదివరకు కూడా వడ్డీ లేని రుణాలు అందజేయడం జరిగిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను కూడా సంఘాల్లో చేర్పించి ప్రతి ఆడపడుచు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళలు పెట్రోల్ బంకుల, సోలార్ పవర్ ప్లాంట్ నిర్వహణతో కూడా సంపాదించే అవకాశాన్ని కలిగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి బస్సులు కొనుగోలు చేసేందుకు జిల్లాలోని మూడు మండలాల మహిళా సంఘాలకు సబ్సిడీ రుణాలు ఇవ్వడం జరిగిందని, మిగిలిన మండలాలకు కూడా త్వరలోనే బస్సులు కొనుగోలు చేసేందుకు సహకరిస్తామన్నారు. ఈ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడంతో మంచి ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లోను మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, జిల్లాలోని ఆయా పాఠశాలల్లో రూ.10 కోట్లకు పైగా నిధులతో మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికల్లోను ప్రభుత్వం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం గర్వకారణమన్నారు. అనంతరం గద్వాల నియోజకవర్గ వర్గానికి సంబంధించి 2248 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రూ.2.28 కోట్ల విలువైన చెక్కును ఎమ్మెల్యే కలెక్టర్ తో కలిసి ఆయా మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు, డిపిఎం లు సలోమి, అరుణ, ఆయా మండలాల మహిళ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకే పథకాలు

- మహిళా సాధికారతతో ప్రతి కుటుంబం, గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి
- 18 సంవత్సరాల వయస్సు నిండిన మహిళలు అందరిని మహిళా సంఘంలో చేర్పించండి
- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి



ఎమ్మెల్యేకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు



చీరల పంపిణీ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**పెబ్బేర్,నవంబరు 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు 3.12 కోట్ల వడ్డీ లేని రుణాల మంజూరు, ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడమే కాకుండా అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళలకే ఇచ్చి మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా ఇందిరమ్మ పాలనలో మహిళలు ఆర్థిక సాధికారత సాధించడమే కాకుండా వారి కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని పెబ్బేరు మండలం వల్లపు రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించగా శాసన సభ్యులు తూడి మేఘారెడ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి మొదటి సంతకం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పై పెట్టడం జరిగిందన్నారు. 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500లకే సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచడం, అర్హులైన ప్రతి కుటుంబానికి తెల్లరేషన్ కార్డు, రేషన్ కార్డులోని సభ్యులు ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం జరుగుతోందన్నారు. రైతులకు రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు మహిళలకే ఇస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకే ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, వడ్ల కొనుగోలు కేంద్రాలు మహిళలకే అప్పగించడం, ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరున మంజూరు చేయడం, పెట్రోల్ పంపు, ఆర్టీసీ బస్సులకు యజమానులు చేయడం, సోలార్ యూనిట్,మహిళా క్యాంటీన్ లు తదితర అన్ని రంగాల్లో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నేడు మహిళలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా వారి కుటుంబాలు, తద్వారా గ్రామాలు బాగుపడుతున్నాయని వివరించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, తద్వారా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం లేదని చెప్పారు. 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి మహిళకు నాణ్యమైన ఇందిరమ్మ చీర ఇవ్వడం జరుగుతుందని, ఇది మహిళా సంఘాల సభ్యుల ఆత్మగౌరవం ఇనుమడింప జేస్తుందనీ పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలోని మహిళా సంఘాలకు రూ. 3.12 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని అందులో వనపర్తి నియోజకవర్గానికి రూ. 1,24,95,000 లు మహిళల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళా సమాఖ్య సభ్యుల ద్వారా ఎంపిక చేసినవి నాణ్యమైన చీరలు ఇందిరా మహిళా శక్తి చీరగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.మహిళా సంఘంలో చేరడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని అందువల్ల ప్రస్తుతం మహిళా సంఘాల్లో లేని వాళ్ళని సైతం సంఘంలో చేర్చుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా బలో పేతం చేసేందుకు క్యాంటీన్‌లు, పెట్రోల్ బంక్, ఆర్టీసీ బస్సులు, వడ్ల కొను గోలు కేంద్రాలు వంటి పనులు అప్పజెప్పడం జరుగుతుందని

## తెలుగు గూడెంతో నాకు ప్రత్యేక అనుబంధం

- ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేరింది
- రవాణా సమస్య తొలగింది : ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త :** తెలుగు గూడెం గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమైందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటి రూపాయల సీఆర్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలుగు గూడెంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు నివసిస్తున్న నేపథ్యంలో,వారు పండించిన – మిగతా4లో..



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

## ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నవాబ్‌పేట,నవంబరు 25 ప్రభాతవార్త :**మండలపరిధిలోని కాకర్లపాడు గ్రామపంచాయతీ పర్వత పూర్ మైసమ్మ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంగళవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరై,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ దాత కుటుంబసభ్యులతో, ఆలయ చైర్మన్ కాంగ్రెస్‌నాయకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ధ్వజస్తంభదాత కట్ట సంతోష్ కుమార్, వారి కుటుంబ సభ్యులకు మండల ప్రజలకు ఉండాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ఆలయ ఈవో నరసింహులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరటి రామ చంద్రయ్యతో పాటు మండల ముఖ్య కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

## మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్‌కు శిక్షణ

**ఉప్పునుంతల, నవంబరు 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ఆసుపత్రిలో నేటి నుంచి నెల రోజులపాటు కేజీబీవీ పాఠశాల చెందిన విద్యార్థులు ఒకేషనల్ ఎంపిహెచ్‌డబ్ల్యూ చదువుతున్న వారికి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య అధికారిణి డా. స్వప్న తెలిపారు. ఎంపిహెచ్‌డబ్ల్యూ చదువుతున్న విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో వైద్యపరంగా అన్ని విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అని తెలిపారు. విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ క్రమశిక్షణతో ప్రతి పనిలో నైపుణ్యం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కెజీబీవి విద్యార్థులు పొందుతున్న శిక్షణ కార్యక్రమంలో వైద్య అధికారి డా.అభిలాష్, వైద్య అధికారి నర్సింగ్ ఆఫీసర్ ఉపత్, సుశీల, నిర్మల, ఫార్మసిస్ట్ కుమారచారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎంపి హెచ్‌డబ్ల్యూ విద్యార్థులచే వైద్య సిబ్బంది

## నాయకుల సమక్షంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**నవాబుపేట,నవంబరు 25 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ఇందిరమ్మచీరల పంపిణి కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ నాయకుల సమక్షంలో చీరల పంపిణీ చేయడం జరిగింది. చౌదూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్, శీను,గురుకుంటలో నాయకులు రవీందర్ రెడ్డి, రాజశేఖర్, దాము యాదయ్య జావిద్, లోకిరేవులో గుండేటి యాదయ్య, సురేష్, నరేష్, కృష్ణ గౌడ్,,చెన్నారెడ్డిపల్లి మంత నర్సింలు, రవి, ఎనుమనుగండ్ల మండల అధ్యక్షులు రామచంద్రయ్య, రాజు, హమీద్, పలు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది అని అన్నారు. ముఖ్యంగా మహిళల పేరుమీద ఇందిరమ్మ ఇండ్లు మహిళా శక్తీ బృందాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాలకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు.


ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

## నెట్‌బాల్‌లో కొండాపూర్ విద్యార్థుల ప్రతిభ

**ధన్వాడ,నవంబరు 25 ప్రభాతవార్త :**ధన్వాడ మండలం కొండాపూర్ గిరిజన బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. నల్గొండ జిల్లా హాలియాలో ఇటీవల నిర్వహించిన నెట్ బాల్ రాష్ట్రస్థాయి టోర్నీలో గురుకులం జట్టు అద్భుత ప్రదర్శనతో ద్వితీయ స్థానం సాధించింది. మంగళవారం గురుకులం ప్రిన్సిపల్ ఎం. రాజారాం విజేత బృందాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ విద్యార్థుల కృషి, పట్టుదలకు ప్రశంస నీయమని అన్నారు. క్రీడా విభాగం తపన, కోచ్‌ల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేవీపీ సాంబ్యానాయక్, పీఈటీ ఆంజనేయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా ఈ విజయంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.


నెట్‌బాల్‌లో విజయం సాధించిన విద్యార్థుల బృందం

## 8ఏళ్ల కేసుకు ముగింపు

**2017 గణేష్ నిమజ్జన అల్లర్ల కేసులో అందరికీ విముక్తి**

**ఊట్కూర్,నవంబరు 25 ప్రభాతవార్త:**ఊట్కూర్ మండల కేంద్రంలోని పలువురు ఊరి పెద్దలపై, యువకులు సహా మొత్తం నిందితులుగా ఉన్న 2017 గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన అల్లర్ల కేసులో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, రచ్చ, దాడులు తదితర సెక్షన్లపై విచారణ పూర్తి చేసిన మహబూబ్‌నగర్ జిల్లా న్యాయస్థానం, నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. న్యాయస్థానం స్పష్టంగా పేర్కొన్న విషయాలలో నిందితులపై మోపిన ఆరోపణలకు సరిపోయేంత స్థాయిలో సాక్ష్యాలు, ఆధారాలు లేవని అందువల్ల ఆరోపణలు నిరూపణ కాలేదని పేర్కొంది. దీంతో ఎనిమిదేళ్లుగా సాగుతున్న ఈ కేసుకు చట్టపరమైన ముగింపు లభించినట్లయింది. తీర్పు వెలువడిన వెంటనే వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి మాపై మోపిన అనవసర ముద్ర ఈ రోజు తొలిగింది న్యాయం గెలిచింది" అని వారు భావోద్వేగంగా తెలిపారు. విచారణలో నిమజ్జన సమయంలో చోటుచేసుకున్న అపార్థాలు, గందరగోళం, సంఘటనపై స్పష్టత లేమి వంటి అంశాలు బయటపడగా, నిందితుల తరఫున న్యాయవాదులు సమగ్రంగా వాదనలు వినిపించారు. ఈ తీర్పుతో 2017 గణేష్ నిమజ్జన అల్లర్ల కేసుకు పూర్తిగా పర్దా పడింది.


కేసు నుండి విముక్తి పొందిన యువకులు

## వైద్య కళాశాలలో ట్యూటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**గద్వాలటౌన్,నవంబర్ 25,ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్య కళాశాలలో 3 ట్యూటర్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.మహబూబ్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి/ప్రభుత్వ వైద్య కళాశాలలో మూడు ట్యూటర్ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో,గౌరవ వేతన ప్రాతిపదికన ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.అర్హత గల అభ్యర్థులు 27112025 తేదీ, గురువారం ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి,గద్వాల ప్రాంగణంలో నిర్వహించబడనున్న వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా కోరనైనది.

## లేబర్ కోడ్ల అమలు నిరసిస్తూ టియుసిఐ ధర్నా

**ఆత్మకూర్ నవంబర్ 25, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేవలం నాలుగు లేబర్ కోర్డులుగా విభజించి అమలు చేయడానికి నిరసిస్తూ టియు సిఐ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఆత్మకూరులోని తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి టియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించినటువంటి నాలుగు లేబర్ కోర్ల మూలంగా కార్మికులు బానిసలుగా మారతారని వారానికి 48 గంటలు పనిచేయడం మూలంగా ప్రతిరోజు 12 గంటలకు పైబడి ఫ్యాక్టరీలో పనిచేయాల్సి వస్తుందని తద్వారా కార్మికులు ఆరోగ్యంగా చినించడమే కాకుండా జీవితాలు అక్కడ దుబ్బరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ రంగాలకు అనుకూలంగా వివరిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా తయారు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది గంటల పని దినాన్ని ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మికులు ప్రస్తుతం కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోర్లు రద్దు చేసే వరకు నిరంతరం ఆందోళన కార్యక్రమాలకు మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు చిన్నయ్య, రేణుక, గోవర్ధన్, మహమూద్, మైనద్దీన్ తదితరులతో పాటుగా పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంఛార్జ్‌లతో ఇక్కట్లు

- మృత్యువాత పడుతున్న మూగజీవులు..
- పశువైద్య అధికారుల నియామకం జరిగేనా..
- పాడియే జీవనాధారంగా రైతన్న

**వంగూరు, నవంబర్ 25 ప్రభాతవార్త:**శ్రమను నమ్ముకొని బ్రతుకు బండిని సాగిస్తున్న రైతన్న తన కుటుంబాన్ని సాకేందుకు వ్యవసాయంతో పాటు పశు సంపదను పెంచుకొని పాడిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న రైతన్నకు పశువులు అనారోగ్య బారిన పడడంతో వైద్య సేవలు అందించాల్సిన పశు వైద్య అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతన్న పెంచుకున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్న సంఘటనలు ఎన్నో.... పశువైద్య అధికారులను నియమించి ఈ ప్రాంతంలో మూగజీవాల ప్రాణాలను కాపాడి రైతన్నకు అండగా నిలవాలని పలుమార్లు విన్నరించిన నేటికీ ఫలితం శూన్యం.

**పశు వైద్య అధికారుల నియామకం ఎప్పుడో...**

వంగూరు మండలం కొండారెడ్డిపల్లి, వంగూరు గ్రామాలలో పశు వైద్య కేంద్రాలు ఉన్నప్పటికీ పోల్కంపల్లి గ్రామంలో సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రెండు వైద్యశాలలో ఒక సబ్ సెంటర్లో ఎప్పుడు చూసినా వైద్య అధికారి కుర్చీ మాత్రం ఖాళీగానే దర్శనమిస్తుంది. వంగూరు మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో గతంలో పనిచేసిన వైద్యాధికారులు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో మరొకరిని నియమించేందుకు మాత్రం ఎందుకు వెనుకాడుతున్నారో అన్న ప్రశ్నలు మిగిలిపోతున్నాయి. ఈ ప్రాంతంలో పాడిపై ఆధారపడి జీవనాధారం కొనసాగిస్తున్న రైతు కుటుంబాలే ఎక్కువ. వంగూరు మండలంలో ఉన్న పశు వైద్యశాలలో వైద్యాధికారులు లేకపోవడంతో ఇన్చార్జీలను నియమించడం వలన అతను ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో ఎవరికి తెలియదు. వైద్యాధికారి లేకపోవడంతో పశువుల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు సరైన మందులు ఇచ్చేవారే కరువయ్యారు. వైద్య అధికారులను నియమించి ఈ ప్రాంత మూగజీవాల ప్రాణాలు కాపాడితే రైతన్నలు తన జీవనాధారాన్ని పెంపొందించుకుంటారు. ప్రభుత్వం నుండి సబ్సిడీ ద్వారా అందాల్సిన పశుగ్రాసం విత్తనాలు సరఫరా లేకపోవడంతో రైతన్నలు నానా తంటాలు పడి సమకూర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతే దేశానికి వెన్నెముక రైతన్నను అభివృద్ధి పరిచి రైతులకు అండగా ఉంటామని ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప రైతన్న శ్రేయస్సు కోసం పని చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదని చెప్పుకోవచ్చు.



వంగూరు మండలంలోని పశువైద్యశాల


ఖాళీగా దర్శనమిస్తున్న పశువైద్యాధికారి

### వైద్యులను నియమించాలి



వంగూరు మండలంలో ఖాళీగా ఉన్న పశు వైద్య అధికారుల స్థానాలను భర్తీ చేసి ఈ ప్రాంతంలో ఉన్న మూగజీవాల ప్రాణాలను కాపాడి పాడి అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. పశువైద్య అధికారులు లేకపోవడం వల్ల మూగజీవాల ఆరోగ్య పరిస్థితులు అతలాకుతలమై మృత్యువాత పడుతున్న పట్టించుకున్న నాధుడు కరవయ్యారు. పాలకులు జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఖాళీగా ఉన్న వైద్యాధికారుల స్థానాలను భర్తీ చేసి ఈ ప్రాంత రైతులకు అండగా నిలువాల్సిన అవసరం ఉంది.

– సుమన్, వంగూరు

### మూగజీవాల ప్రాణాలను కాపాడండి



వైద్యం అందక మృత్యువాత పడుతున్న మూగజీవాల ప్రాణాలను కాపాడి రైతన్నకు పాడి అభివృద్ధిపై ప్రోత్సాహం కల్పించాలి. పాడిపైన జీవనాధారం కొనసాగిస్తున్న రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు అధికారులు పాలకులు చొరవ తీసుకొని ప్రభుత్వం నుండి అందించే పథకాలు రైతన్నకు చేరే విధంగా కృషి చేయాలి. పశువైద్యశాలలో మూగజీవాలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని రైతన్న మేలుకోరి అధికారులు పాలకులు కృషి చేస్తే ఈ ప్రాంత రైతులు అభివృద్ధి చెందుతారు.

– మీసాల స్వామి

## రెవిన్యూ అధికారులను అభినందించిన అదనపు కలెక్టర్

**చిన్నచింతకుంట, నవంబరు 25 ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్దేశించిన పనులను సక్రమంగా నిర్వర్తించిన రెవెన్యూ అధికారులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అభినందించారు. మంగళవారం ఆయన జిల్లాలోని ఆయా మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ మండల తహసిల్దార్ కార్యాలయానికి వచ్చారు. భూభారతి, సాదా బైనమా, భారత్ మాల తదితర పనులను ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేసినందుకు తహసిల్దార్ ఎల్లన్నతో పాటు రెవిన్యూ సిబ్బందిని ప్రసంగించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి భూ సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజల మన్నన పొందుతారని ఆయన తెలిపారు. జిల్లాలోని సిసి కుంట మండల తహసిల్దార్ కార్యాలయం ఎలాంటి పెండింగ్ ఫైల్స్ లేకుండా సత్వరమే సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయడంలో రెవెన్యూ అధికారులు సమన్వయంతో పూర్తిచేయడంపై తహసిల్దార్ ఎల్లన్నను శాలువాతో సత్కరించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. మండలంలోని రైతులు తమ వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని అదనపుకలెక్టర్ మధు సూదన్‌నాయక్ తెలిపారు. ఇప్పటికీ 53కోట్లరూపాయల వరిధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 19కోట్ల 32లక్షల నగదును రైతుల ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా నగదును వేగవంతంగా రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వరి కొనుగోలు చేస్తామని, వరి ధాన్యం తూకాలు వేసిన తర్వాత రైస్ మిల్లులకు ధాన్యంతో వెళ్లే వాహనాలకు రవాణా ఖర్చులు రైతులు భరించాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే నోడల్ అధికారైన తహసిల్దార్ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ క్రాంతి కుమార్ గౌడ్, ఆర్ఐలు తిరుపతయ్య, అమీర్, జూనియర్ అసిస్టెంట్ లు శివకుమార్, విష్ణు, కంప్యూటర్ ఆపరేటర్ రాంబాబు, జిపిఓలు ఉన్నారు.


తహసిల్దారును శాలువాతో సత్కరించిన అదనపు కలెక్టర్

## ప్రజా ప్రభుత్వంలో మహిళకు పెద్దపీట

### వెల్టూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ

**ఉప్పునుంతల, నవంబరు 25 ప్రభాతవార్త :** మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెల్టూరు గ్రామపంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు అందించి వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. మహిళ ఆత్మ గౌరవాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళల సాధికారితే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. ఆరులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీర అందుతుందని సూచించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్, రాగి వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, గ్రామస్తులు మల్లయ్య, బాలస్వామి, లింగమయ్య, జంగయ్య, రాజుమౌళి, గుడ్డటి బాలరాజు, మహిళా సమాఖ్య గ్రామ సంఘం అధ్యక్షురాలు రాగి సునీత, అలివేల, ఎల్లమ్మ, సాయిబాబు, సత్యనారాయణ, సాయిబాబు, కాటమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వెల్టూర్‌లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి : చైర్మన్

**ఆత్మకూర్ నవంబర్ 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు గ్రామస్థాయి ప్రజలు రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా విజ్ఞప్తి చేశారు. మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో మంగళవారం రోజు ఇందిరా క్రాంతి పథకం ద్వారా పంపిణీ చేస్తున్నటువంటి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలో ముమ్మరంగా ప్రతి గ్రామానికి చీరలు పంపిణీ చేసినట్లుగా ఆయన తెలిపారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనుకబడిపోయిన ఆత్మకూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు మంత్రి వాకిటి శ్రీహరి కంకణం కట్టుకున్నారని తద్వారా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలతో పాటుగా వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ పంపులు, తదితర వ్యాపార రంగాలలో సైతం మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సంపూర్ణంగా నారీమణులు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగన్న, కాజన్నా, శ్రీనివాసులు, భాస్కర్, రాములు తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

## మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : డిసిసి జిల్లా కార్యదర్శి

**అమరచింత నవంబర్ 25, ప్రభాతవార్త:** మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయముగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అయూబ్ ఖాన్ అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని చింత రెడ్డిపల్లె,మిట్ట నందిమల్ల, ఈర్ల దీన్నే, నందిమల్ల ఎక్స్ రోడ్డు, కృష్ణంపల్లి, చంద్ర గట్టు, చంద్ర పతాండ, మస్తిపూర్, సింగంపేట, పామిరెడ్డి పల్లె, కొంకను వానిపల్లె, ధర్మాపూర్, నాగల్ కదుమూర్, గ్రామాలలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసిందని ఆయన అన్నారు. రాష్ట్రం ముఖ్యమంత్రి ఎన్నికలలో మహిళలకు 500 కే గ్యాస్ సిలిండర్ తో పాటు ఇందిరమ్మ ఇండ్లు, మహిళా క్యాంటీన్లు ఇస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళుతున్నామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందిరా గాంధీ పేరిట మహిళలకు చీరలు పంపిణీ చేసి రాష్ట్ర ప్రభుత్వం మహిళలను గౌరవిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర మత్స్య శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ, మహంకాళి విష్ణు, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు, లక్ష్మీకాంత రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు అనుమంతు నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తౌఫిక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, రాకేష్ గౌడ్, హరీష్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ విష్ణు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అధికారులు, మహిళా సమైక్య అధ్యక్షురాలు అంజనమ్మ, సిసి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మండల వాసవి క్లబ్ అధ్యక్షులుగా ఆలంపల్లి కృష్ణ


ఆలంపల్లి కృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 25 ప్రభాతవార్త:**మండల వాసవి క్లబ్ నూతన అధ్యక్షులుగా వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లి కృష్ణ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, 2026 గవర్నర్ కల్మిచర్ల రమేష్, చార్టెడ్ ప్రెసిడెంట్ పూరి రమేష్ సమక్షంలో ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా పూరి అనిల్, కోశాధికారిగా కాశం అరవింద్, వనిత క్లబ్ అధ్యక్షురాలు ఆలంపల్లి అనిత, ప్రధాన కార్యదర్శి పూరి లక్షి మ్మ, కోశాధికారి కాసం శ్రీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రచార కార్యదర్శి మిరియాల రాజయ్య, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, సాతాపూర్ మల్లేష్, బికుమాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆవోప నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**కల్వకుర్తి, నవంబర్ 25 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ఆవరణంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆవోప నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నూతన అధ్యక్షులు కలిమిచర్ల రాఘవేంద్రర్, ప్రధాన కార్యదర్శి యాద శోభన్ బాబు, కోశాధికారి కల్వ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొంటారని, ఆర్యవైశ్య మహాసభ సంఘం అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవంతం చేయాలని నూతన కమిటీ సభ్యులు కోరారు.

## రాష్ట్ర గ్రామ పాలన ఆఫీసర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మట్ట చంద్రశేఖర్ గౌడ్

**వెల్దండ, నవంబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన గ్రామ పాలన ఆఫీసర్‌గా మట్ట చంద్రశేఖర్ గౌడ్‌ను హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. చంద్రశేఖర్‌గౌడ్‌ను పలువురు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.



## మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**దేవరకద్ర, నవంబరు 25 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలను మహిళ మండల అధ్యక్షురాలు, మండల సీసీ శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల అధ్యక్షురాలు, బుక్ కీపర్, సిసి శ్రీనివాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేసిన దృశ్యం

## తోబుట్టువుగా భావించి ప్రభుత్వం చీరల పంపిణీ

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం : కాంగ్రెస్ నాయకులు**



లింగసానిపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

**బిజినేపల్లి, నవంబరు25 ప్రభాతవార్త:** ఇందిరాగాంధీ చేసిన అభివృద్ధి బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. లింగసానిపల్లి, లట్టుపల్లి పరిధిలోని చిన్న పీరు తండా, ఉడుగులకుంట తండాల్లో మంగళవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి సోదరుడిగా మహిళలకు తోడు నిలిచారని అన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించి, అద్దె బస్సులకు వారిని యజమానులను చేశారని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీరలు ఇస్తామని వెల్లడించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనన్నారు. ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను కూడా మహిళా సంఘాలకే అప్పగించినట్లు తెలిపారు. ఇందిరమ్మ పాలనే ఆదర్శంగా రాష్ట్ర సర్కార్ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరేందర్ గౌడ్ సురేందర్ రెడ్డి, మూడవత్ గోవింద్,మాజీ సర్పంచ్ చందులాల్, మూడవత్ సాలెమ్మ, మునీందర్, రాంచందర్, కృష్ణ ప్రసాద్, శ్రీను, దీపక్, దుధ్యా, బాలు, సొమ్లు, సేవియా మంగీలాల్, ప్రశాంత్ మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**వనపర్తి, నవంబరు 25 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సునిత రెడ్డి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా శాంతి భద్రతలు, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించుకున్నారు. రెవెన్యూ, పోలీసు విభాగాల పరస్పర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఇద్దరు అధికారులు నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల తగ్గింపు, యువతలో చట్ట అవగాహన కార్యక్రమాలు, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారంలో వేగవంతమైన స్పందనకు కట్టుబడి పనిచేస్తామని నూతన ఎస్పీ తెలిపారు. జిల్లా శాంతి, అభివృద్ధి లక్ష్యంగా అధికార వ్యవస్థ కలిసి పనిచేయనుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు.

## రోడ్డుపై పేరిన దుమ్ము ధూళితో ప్రజల ఇక్కట్లు

◆ మండల కేంద్రంలో పేరుకుపోయిన ఇసుక దుమ్ము ధూళి



దుమ్ము, ధూళితో నిండిపోయిన చౌరస్తా

**నవాబు పేట, నవంబరు 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తెల్లవారు వ్యవసాయ మార్కెట్ యార్డ్, శివాజీ, ఎర్ర సత్యం చౌక్ నుండి వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు నుండి మండల కేంద్రానికి వచ్చే వరకు రద్దీగా ఉండే నవాబుపేట కేంద్రం రోడ్డు మొత్తం ఇసుక దుమ్ముతో కూడపోయి రద్దీగా ఉండే ఈ రోడ్లపై వాహనాలు తిరుగుతూ ఉండటంతో అధికంగా దుమ్ము దూళితో చుట్టుపక్కల ఇండ్లు వాహనదారులకు ఇబ్బందులను కలుగజేస్తుంది. దానితో పాదచారులు బస్సులు, లారీలు, టిప్పర్లు, బొలెరో వాహనాలు వస్తే చాలు చౌరస్తా మొత్తం దుమ్ముతో నిండిపోతుంది. దీనికి తోడు వాహనాలు వెళుతున్నప్పుడు దుమ్ము, ధూళి విపరీతంగా వస్తుండడంతో రోడ్డు వెంట ప్రయాణికులు దుమ్ముకూడిన గాలిన పీల్చి శ్వాసకోసఇబ్బందులకు గురవుతున్నారని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మీద నిలబడాలంటే దుమ్ము,ధూళి ప్రజలపై పడి బట్టలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడప్పుడు హడావుడిగా పారిశుద్ధ కార్మికులు ఆఇసుక దుమ్మును ఎత్తకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపు యజమానులకు, బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో వెంటనే సదరు అధికారులు గ్రహించి, వాహన రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరుతున్నారు.

## అనుమానాస్పదంగా రైతు మృతి



మృతి చెందిన రైతు చంద్రప్ప (ఫైల్)

**ఊట్కూర్, నవంబరు 25 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని ఏడవెల్లి గ్రామంలో నిద్రలో నే రైతు మృతి చెందాడు. ఈ ఘటన అనుమానాస్పద పాము/పురుగు కాటుతో రైతు మృతి చెందిన విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదుదారు సుజాత తెలిపిన వివరాల ప్రకారం 19.11.2025 ఉదయం ఆమె భర్త సాయిలు చంద్రప్ప (36) పొలం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. కుటుంబంతో భోజనం చేసి రాత్రి నిద్రపోయాడు. అయితే 20.11.2025 ఉదయం 6గంటల ప్రాంతంలో సాయిలు మేల్కొనక పోవడంతో భార్య పిలిచినా స్పందించలేదు. స్పృహ లేని పరిస్థితిలో ఉన్న చంద్రప్పను గుర్తు తెలియని పాము లేదా పురుగు కాటువేసి ఉండొచ్చనే అనుమానంతో వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతరం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో సాయిలు మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నిరుపేదలకు సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

◆ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

**రాజాపూర్, నవంబరు 25 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని చొక్కంపేట గ్రామంలో 42 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలను మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. 22.70 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకు స్థాపగ్రామ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉందని పేర్కొంటూ, మొత్తంరూ. 42 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే గ్రామంలో రూ. 22.70లక్షలతో నిర్మించనున్న పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామంలో విద్యావాతావరణం మరింత భద్రంగా, సమర్థంగా మారేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. తరువాత గ్రామంలోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తూ, మహిళా సంక్షేమం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సామాజిక సబలీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందనిఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు,పలువురఉ అధికారులు పాల్గొన్నారు. అనంతరం కుచ్చర్‌కల్‌గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. నిరుపేదలకు సొంతింటి కళ సాకారం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



కుచ్చర్‌కల్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన అనంతరం లబ్ధిదారునితో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

# అవినీతి అధికారిపై చర్యలేవి..?!

**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వనపర్తి డీఎస్‌ఓ**

**కోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయని జిల్లా అధికారి**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాచలా యుగంధర్ గౌడ్

**వనపర్తి, నవంబరు 25 ప్రభాతవార్త:** జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారిఆగడాలు శృతిమించుతున్నాయని అతనిపైవెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై గతంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ రకరకాల కారణాలతో డిఎస్‌ఓపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లాలోని అనేకమంది అవినీతి అధికారులపై బీసీ పొలిటికల్ జెఏసి ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకున్న కలెక్టర్ డీఎస్‌ఓపై మాత్రం ఎందుకు ప్రేమ చూపిస్తున్నారో తెలియడం లేదని విస్మయం వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి సంబంధించి గతంలో కూడా అనేకనిజాలు వెలుగు చూశాయని,ధాన్యం అట్టడుగులో ఉండడం, బకాయిలు అధికంగా ఉండడం వంటి కారణాలతో సివిల్ సప్లయ్ శాఖ జిల్లాలో పూర్తిగాభ్రస్టుపట్టే పరిస్థితి నెలకొందన్నారు. 2022 ,23 రబీకి సంబంధించి రూ. 436 కోట్ల విలువగల యాక్షన్ ప్యాడి జిల్లాలో ఉందని, అనేకమంది డిడిలు కట్టడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ కేబినెట్ సబ్ కమిటీ ధర నిర్ణయించకపోవడంతో డీడీలు కట్టడం లేదన్నారు.అదేవిధంగా పావని రైస్ మిల్ యజమానితో దాదాపు రూ. కోటి24 లక్షల విలువగల యాక్షన్ ప్యాడి ఉందనే నెపంతో అతనిపై కేసు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆ వ్యక్తి రూ. 62లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసి చెక్కులు కూడా సివిల్ సప్లయ్ అధికారులకు ఇవ్వడం జరిగిందని, ధర నిర్ణయించిన తర్వాత మిగిలిన మౌంట్ కూడా కట్టడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిపై కేసులుపెట్టడానికి కారణం ఏంటో చెప్పాలన్నారు. అధికారుల ఉద్దేశం రికవరీ చేయడమా? లేక రికవరీ చేయకుండా అక్రమ కేసులు పెట్టడమా? అని ప్రశ్నించారు. జిల్లాలో రూ. 436 కోట్లు బకాయి ఉన్న వారిపై కేసులు ఎందుకు పెట్టడం లేదో డిఎస్‌ఓ సమాధానం చెప్పాలన్నారు. టెండర్ ప్యాడిపై ఎలాంటి యాక్షన్ తీసుకోవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాలను సైతం డీఎస్‌ఓ తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు ధాన్యం కేటాయిస్తూ జిల్లాలో తన సొంత చట్టాన్ని డిఎస్‌ఓ కాశీ విశ్వనాథ్ అమలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. నిజాయితీపరుడిగా పేరు తెచ్చుకున్న కలెక్టర్ తక్షణమే డీఎస్‌ఓ అవినీతిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, లేదంటే డిఎస్‌ఓ అవినీతి మరకలు కలెక్టరుకు కూడా అంటుకునే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఏసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ,రాష్ట్ర కార్యదర్శి వివిగౌడ్, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, నాయకులు అస్కని రమేష్, చెలిమిల్ల రామన్‌గౌడ్, రమేష్, బీమపల్లి, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



పార్టీలోకి చేరుతున్న వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, నవంబర్ 25 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్కూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని కమ్యూనిటీ భవనాలు, చెర్కూర్ నుండి వెల్దండ మట్టి రోడ్డు పనులు, కళాకారులకు డప్పుల పంపిణీ, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలఅభివృద్ధికి ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీతోనే నడవాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవు తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడం కోసం వడ్డీ లేని రుణాలు అందించడంతోపాటు వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యెన్నంభూపతిరెడ్డి, చేర్క రేవతి రాజశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, కేశమల్ల కృష్ణ,మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, రషీద్, పుల్లయ్య, శ్రీనివాస్ యాదవ్, నరసింహ, భీమరాజు తదితరులు ఉన్నారు.

## ధాన్యాన్ని రోడ్లపై పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు

◆ ధాన్యం ఆరబెట్టడానికి ప్రత్యామ్నాయ ప్రదేశాలు వాడండి

◆ ప్రమాదాల నివారణలో రైతులే మొదటి భాగస్వాములు

◆ వనపర్తి జిల్లా ఎస్పీ సునీతరెడ్డి



జిల్లా ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)

**వనపర్తి, నవంబరు 25 ప్రభాతవార్త:** రోడ్లపై ధాన్యాన్ని పోసి కల్లాలుగా మార్చడం వాహనదారుల ప్రాణాలకు నేరుగా ప్రమాద మవుతుంది. రాత్రివేళల్లో ధాన్యంకుప్పలు గుర్తు పట్టలేక, తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై ధాన్యం పోయ కుండా, ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో ఆరబెట్టాలని రైతులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజల ప్రాణాలు కాపాడడం అందరి బాధ్యతని జిల్లా ఎస్పీ సునీతరెడ్డి, అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం కేవలం నిర్లక్ష్యం కాదు అది ప్రాణాంతకం. రాత్రి వేళల్లో స్పష్టంగాకనిపించక, వాహనాలు ధాన్య కుప్పలకు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు మనం దరిసీ కలచివేస్తున్నాయి. రోడ్లపై ధాన్యం పోసి కల్లాలుగా మార్చడం వల్ల వాహనదారులు రాత్రి సమయాలలో గమనించక ప్రమాదాలు జరిగిచనిపోతున్నారు. రైతులు బావుల దగ్గర ఇండ్ల వద్ద లేదా సొంత పొలాల్లో ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ప్రత్యేకంగా కల్లాలను ఏర్పాటు చేసుకోవాలని నిరక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి వాహన దారులకు ఇబ్బంది కలిగించి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దని రైతులను కోరారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని వాహనదారులు వాటిని ఢీకొని చనిపోవడం జరుగుతుంది. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీసు అధికారులు సిబ్బంది గ్రామాలలో రైతులకు విధిగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు రైతులు ప్రజలు సహకరించాలని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

## బిఆర్ఎస్ అభివృద్ధి కాంగ్రెస్ అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధం




విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, నవంబరు25 ప్రభాతవార్త:** మక్తల్ కాంగ్రెస్ పట్టణ కార్యాలయంలో కాంగ్రెస్ మక్తల్ మండల అధ్యక్షులు ఏ. గణేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అభివృద్ధిపై మాట్లాడడం తగదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. మీరు పరిపాలించిన 13సంవత్సరాలలోఅభివృద్ధి ఎక్కడ జరిగిందోచూపించాలని అన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి ఎలా జరిగిందని మేము తెలియ జేస్తామని అన్నారు. మక్తల్ నుండి నారాయణపేటకు చేరుకోవడానికి రోడ్డు బాగా లేనందున దాదాపు రెండు కోట్లతో నాలుగులైన్ల రోడ్డుకు త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారని తెలియజేశారు. అభివృద్ధి విషయంలో చర్చకు మీరు ఎక్కడ ఎప్పుడు అనే నిర్ణయిస్తే చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. మక్తల్ అభివృద్ధిలో భాగంగా 150 పడకల ఆసుపత్రినిర్మాణం ముమ్మరంగా జరుగుతుందని ఇంటిగ్రేటెడ్ పాఠశాల భూమిపూజ కూడాగొల్లపల్లి వద్ద ముఖ్య మంత్రి చేతుల మీదుగా అవుతుందని, డిగ్రీ కళాశాల మంజూరు చేసెడమే కాకుండా క్లాసులు నిర్వహించి డిగ్రీ పరీక్షలు కూడా ఇక్కడే నిర్వహించే విధంగా ఏర్పాటు చేశామని అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో దయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటుచేసి పేదలకు సర్వీస్ అందజేస్తున్నామని, సంగం బండ కొద్దిపాటి బండను పగలగొట్టిఉండి ఉంటే ఐదు గ్రామాలకు నీరు అందించేవి కానీ మీ హాయంలో ఎందుకు బండను తొలగించలేదని ప్రశ్నించారు. ఇన్ని అభివృద్ధి పనులు మీకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. మీ హాయంలో మిషన్ కాకతీయలో భాగంగా అన్ని నియోజకవర్గాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే మన నియోజకవర్గానికి కేవలం కోటి రూపాయలు తీసుకురావడం సిగ్గుచేటని రెండుసంవత్సరాలలోనే ఇన్నిఅభివృద్ధి పనులు జరుగుతున్నందుకు సంతోషపడాలని తెలియజేశారు. కాంగ్రెస్ శ్రేణులు ఎల్లప్పుడూ చర్చలకు సిద్ధంగా ఉన్నామని మీరు సమయం నిర్ణయిస్తే మేము అంగీకరించి ఆ మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు మేమంతా సిద్ధంగా ఉన్నామని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ మేము రెండేళ్ల పరిపాలనలో ఎన్ని నిధులు సమకూర్చామనీ అదే మీరు 13 సంవత్సరాల పరిపాలనలో నిధులు ఎన్ని సమకూర్చారోఎంతఅభివృద్ధి చేశారో చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఎంసీ డైరెక్టర్లు ఫయాజ్, శాలం, పారేవుల విష్ణు వర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి భాస్కర్, మాజీ సర్పంచ్ గడ్డం రమేష్, చెన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



మహిళలకు ఇందిరమ్మ చీరలు అందజేస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు25 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ చీరలపంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. నాగేష్ గౌడ్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఎల్లప్పుడూ కృషి చేసిన మహానేత ఇందిరమ్మ కలలుగన్న స్వరాజ్య సాధన దిశగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుసగా నెరవేర్చుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నదన్నారు. ఈ క్రమంలో మహిళల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ చీరల పంపిణీ రాష్ట్రంలో మంచి స్పందనను పొందుతోందని తెలిపారు. గతంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరలతో పోలిస్తే, ఇప్పుడు అందిస్తున్న ఇందిరమ్మ చీరలు మరింత మెరుగైన నాణ్యతతో ఉన్నాయని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ సావిత్రమ్మ,వి.బి.కే. వెంకట్‌రెడ్డి, మహిళా నాయకురాలు బాబమ్మ, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజప్ప, గోవర్ధన్ రెడ్డి, సిద్దు, నేడు, గుండు రాజు, నారాయణ గౌడ్, పత్తి ఆంజనేయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ 181

■ హింసకు గురైన బాధితులకు అండగా ఉంటాం

■ మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, నవంబరు 25 ప్రభాతవార్త:** మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వయోలెన్స్ ఆగెన్స్ట్ ఉమెన్) సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిమాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస వేధింపులు, మహిళలు ఇంట్లో, బయట హింసకు గురికాకుండాఅన్నిరంగాలలో, విషయాలలో ముందంజలో ఉండాలని, ఎక్కడైనా హింసకు గురిఅయిన చోట మహిళలు మన జిల్లాలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటరు నిర్వహించడం జరుగుతుందని, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 కు కాల్ చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారిణిజరీనా, డిఆర్‌డిఓ నర్సింహులు పాల్గొన్నారు.

## మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి




**ధన్వాడ, నవంబరు 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ధన్వాడ మండలం అంతా ఎన్నికల రాజకీయం మరింత రగిలిపోతోంది. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి స్థానిక నాయకులు, అభ్యర్థి ఆశావహులు తమ బలగాలను అలర్ట్ చేస్తూ గ్రామాల్లో పర్యటనలు వేగవంతం చేశారు. ఎన్నికల కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల తేదీలు డిసెంబర్ 11 తొలి విడత డిసెంబర్ 14 రెండో విడత, డిసెంబర్ 17 మూడో విడతగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ తేదీలలో మొదటి విడత నవంబర్ 27 నుండి, రెండో విడత నవంబర్ 30 నుండి మూడో విడత డిసెంబర్ 3 నుండి నిర్వహించనున్నారు. ధన్వాడ మండలంలోని గ్రామాల్లోఇప్పటికే అభ్యర్థి ఎంపికలు, సమీకరణాలు జోరందుకున్నాయి. గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీ స్థానిక నేతలు సమావేశాలు నిర్వహిస్తూ ప్రజాభిప్రాయం ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేయడం జరుగుతోంది. సర్పంచ్ పదవులపై ఆసక్తి చూపుతున్న నాయకులు ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు ఇంటింటా మెలకువలు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ సమయంలో భారీ రద్దీ ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది కేటాయింపులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మండల అధికారుల సమాచారం. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని, నియమ నిబంధనలకు లోబడి ప్రచారం చేయాలని ఎన్నికల శాఖ సూచించింది. ధన్వాడ మండల ప్రజలు కూడా అభివృద్ధి, పారదర్శకత, మంచి పాలనకు మద్దతు ఇచ్చే నాయకులను ఎన్నుకునే దిశగా చర్చలు ప్రారంభించారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌తో ధన్వాడ మండలంలో ఎన్నికల వేడి రానున్న రోజుల్లో మరింత పెరగనుంది.

## సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**నవాబుపేట, నవంబరు 25 ప్రభాతవార్త:** ఎట్టకేలకు ప్రభుత్వం స్థానికసర్పంచ్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడు విడతలుగా ఎన్నికలను జరపనుందని డిసెంబర్ 11న ఎన్నికలకు మొదటి విడతలో నవాబుపేట మండల గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించడం జరగనుందని అధికారులు తెలిపారు. ఈనెల 27వ తేదీ నుండి సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించబడతాయని తెలిపారు. సర్పంచ్ కు పోటీ చేసే అభ్యర్థులు వార్డు సభ్యుల నామినేషన్లు ఈ పది గ్రామపంచాయతీ సెంటర్లలో స్వీకరించబడతాయి. 1 కొల్లూరు, చౌడూరు, పోమాల్, గురుకుంట, నవాబుపేట్ కొండాపూర్, కారుకొండ, కూచూరు, ఇప్పటూరు, లింగంపల్లిలో నామినేషన్లు సమర్పించాలని తెలియజేశారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేసిన దృశ్యం

**మక్తల్ టౌన్, నవంబరు25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు భూత్పూర్ గ్రామపంచాయతీ దగ్గర సెక్రెటరీ వీరన్న, వివోఏ శమంతకమణి, అధ్యక్షులు సంగీత మహిళా సంఘం సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కే .కురుమయ్య గౌడ్, వాకిటి నాగప్ప, కె. చెన్నయ్యగౌడ్, చిన్న బాలయ్య, కురువ నరసింహ, చెన్నారెడ్డి, పేట చెన్నప్ప, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన కార్యక్రమం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

**దేవరకద్ర, నవంబరు25 ప్రభాతవార్త:** లక్ష్మీ వెంకటేశ్వర ఉన్ని పరిశ్రమను ఉత్పత్తి అమ్మకముల సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ఆధీనంలో మంగళవారం పిఎంఈజీపి, ఓఎన్‌డిసి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సౌకర్యాలు, సబ్సిడీ గురించి పలు సూచనలకు సలహాలు ఇస్తూ, క్లస్టర్‌కు సంబంధించి 50 మంది లబ్ధిదారులకు పథకం గురించి అర్హత, ప్రమాణాలకు, శిక్షణ అందులో ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ యాదయ్య, చంద్రశేఖర్, గోపన్‌పల్లి మహబూబ్ ఆలీ పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు జడ్చర్ల ఉపాధ్యాయులు

(మొదటి పేజీ తరువాయి)

లఘునాటిక విభాగంలో భువనవిజయం నాటిక ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో శ్రీకృష్ణదేవరాయలుగా చక్రవర్తుల వేంకట రమణాచార్యులు, అల్లసాని పెద్దనగా పూదత్తు కృష్ణమోహన్, నంది తిమ్మనగా మల్కాచి రాఘవేంద్రాచారి, ధూర్జటిగా రత్నశేఖర్ కల్వోజు, తెనాలి రామకృష్ణుడుగా భాస్కర్ యలకంటి, రామరాజ భూషణుడు (భట్టుమూర్తి)గా గుంత శ్రీనివాసులు, పింగళి సూరనగా రాసమల్ల నర్సిములు, అయ్యల రాజు రామభద్రుడుగా బందారపు నిమ్మయ్యగౌడ్, మాదయగారి మల్లనగా దార్ల రాఘవేంద్రాచార్యులు, నరసకవిగా నరేష్‌గౌడ్ సురగౌని, కవి శిఖామణిగా అలకుంట అనంతరాములు పాల్గొన్నారు.

## అవినీతి,అక్రమాలను వెలికి తీస్తాం...!!



వ్యాయామ శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

అవినీతికి పాల్పడ్డారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ పై విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. తాము ఎన్నికలకు ముందు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాలు,భూకబ్జాలు,బీసీ లపై పెట్టిన అక్రమ కేసులు కవిత ఉటంకించారే తప్ప కొత్తగా ఏమీ మాట్లాడలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అవినీతి అక్రమాలను బయటపెడతామన్న మాట పై నిలబడ్డామన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కబ్జాపెట్టిన2.20ఎకరాల భూమిని, మహమదాపూర్ శివారులో తాను అక్రమంగా వినియోగిస్తున్న ఉచిత విధ్యుత్,నీటి సరఫరాను తాను అధికారంలోకి వచ్చాకే తొలగించానన్నారు. పెద్దమందడి మండల, వెల్టూరు చెరువు అక్రమ నీటి దోపిడీని నిలువరించామని తెలిపారు. పెద్దమనిషి, వారి దత్తపుత్రులపై కేసులు నమోదు అయ్యాయని, సమయం వచ్చినప్పుడు వివరాలను బయట పెడతామని అన్నారు. అనుచరుల కోరిక మేరకు సార్‌ను జైలుకు పంపుతామన్నారు. పంచాయతీ (రూ.100 కోట్లు),రోడ్డు, భవనాలు (రూ.90 కోట్లు) శాఖల పరిధిలోని రహదారుల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పనులను మొదలుపెడతామని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, తాను అధికారం లోకి వచ్చిన రెండేళ్ల సమయంలో వనపర్తి నియోజకవర్గంలో మొత్తంగా 2వేల 2వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను తెచ్చామని వివరించారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో గత తొమ్మిది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.తాను అవినీతి అక్రమాలకు పాల్పడకుంటే దేవుని ఎదుట ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే మెగారెడ్డి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

(మొదటి పేజీ తరువాయి)

సంఘాల్లోని సభ్యులు ఎవరైనా అనుకోకుండా ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబంపై భారం పడకుండా అప్పులోను మాఫీ చేయడమే కాకుండా వారికి రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించిందని, సంఘ సభ్యులు అన్ని రకాలుగా లబ్ధి పొందాలన్నా ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయం నందు టెండర్ల ద్వారా కాకుండా మహిళా సంఘాల సభ్యులకు క్యాంటీన్లను ఇచ్చిందన్నారు. అలాగే మండల మహిళా సమాఖ్యలకు బస్సులు ఇవ్వడం ద్వారా ప్రతినెల మండల సమాఖ్యకు రూ.69వేల ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుందని, అలాగే పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, రకరకాల జీవనోపాధి కార్యక్రమాలను చేసుకొనుటకుఎన్నోరకాల ప్రోత్సకాలను అందిస్తుందని, అలాగే మహిళల కోసం ఉచిత బస్సు పాసు, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్న వారికి లక్ష రూపాయలలోను కూడా మంజూరు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ దేవ సహాయం, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, నాగర్ కర్నూల్ జిల్లా సమాఖ్య కోశాధికారి శోభ, ఐదు మండలాల మండల సమాఖ్యల అధ్యక్షులు,డిపిఎం కృష్ణయ్య, ఏపీఎంలు సూర్య, యాదగిరి, నిరంజన్, శేఖర్, చిట్టెమ్మ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గౌరవాన్ని పెంచుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పని కల్పించినట్లు తెలిపారు. సంఘాలు బాగా పని చేసి కుటుంబ ఆదాయం పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె సూచించారు.తొలి మహిళాసంఘం సభ్యురాలు పూజిత మాట్లాడుతూ బస్సు టికెట్ కొనే స్థితి నుంచి బస్సుయజమానులుగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. సభ్యురాలు సుమిత్ర మాట్లాడుతూ మహిళలకు ధైర్యంగా జీవించేందుకు అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు,జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, డిఆర్డిఓ నర్సింహులు ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలుగు గూడెంతో నాకు ప్రత్యేక అనుబంధం

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యాన్ని మార్కెట్‌కు సులభంగా తరలించేందుకు మెరుగైన రవాణా సదుపాయాలు అత్యవసరమని స్పష్టం చేశారు. తెలుగు గూడెం, ఇప్పలపల్లి, జమిస్తాపూర్ గ్రామాల రైతులు స్థానిక ప్రజలకు ఈ నూతన బిటిరోడ్డు ఎంతో ఉపయోగకరంగా నిలవనుందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రామచంద్రయ్య, మాధవరెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, ఖాజా, మల్లు అనిల్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, తెలుగు గూడెం ఆంజనేయులు, జన్ను సురేందర్, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, నాగయ్యప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకే పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ఏదైనా వ్యాపారం చేయాలని ఆసక్తి ఉంటే తగిన నైపుణ్య శిక్షణ ఇప్పించి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.మహిళా సంఘాలకు రూ. 3.12 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కు అందజేత...ఇంతకు ముందు ఈ సంవత్సరంలోనే వనపర్తి జిల్లాకు రూ. 20 కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు ఏప్రిల్ 2025 నుండి జూలై 2025 వరకు 3 నెలలకు 3.12 కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహం ప్రారంభోత్సవం చేసిన శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పెబ్బేరు మండలంలో ప్రభుత్వబాలికల పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రూ.3.00 కోట్ల నిధులతో నిర్మించిన వెనుకబడిన తరగతుల బాలికలవసతి గృహాన్ని మంగళవారం వనపర్తి శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్‌తో కలిసిరిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు.విద్యార్థులకు అవసరమైనఅన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని శాసన సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఓ ఉమాదేవి, బిసి సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్,అడిషనల్ డిఆర్‌డిఓ సరోజ పెబ్బేరు తహసిల్దార్ మురళి గౌడ్, శ్రీరంగాపూర్ తహసిల్దార్ రాజు,ఎంపీడీఓ వెంకటేష్,మార్కెట్ కమిటి చైర్మన్‌ప్రమోదిని, వైస్‌చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య చైర్మన్ స్వరూప, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు శ్రీలత, పద్మమ్మ,అక్కమ్మ, మహిళాసంఘాల సభ్యులు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ చీరల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

# మోగిన స్థానిక ఎన్నికల నగారా..

- సర్పంచు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- వచ్చే నెలలో మూడు విడతల్లో ఎన్నికలు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ నిబంధన



**భూత్పూర్,నవంబర్ 25,ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికల నగారా మోగింది.రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్డ్ విడుదల చేసింది.వచ్చే నెలలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారు.తొలుత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.డిసెంబర్ 11న తొలివిడత, 14న రెండో విడత,17న మూడో విడత సర్పంచుఎన్నికలు నిర్వహించనున్నారు.ఈ నెల 27నుంచి మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ మూడో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.ఎన్నికలఓటింగ్ జరిగిన రోజునే మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిపి సాయంత్రానికల్లా ఫలితాలు ప్రకటిస్తారు.రాష్ట్రంలోని జిల్లాల్లోని 12,733 గ్రామ పంచాయతీ లతో పాటు 1,12,288 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే జిల్లాల్లో కోటీ 66లక్షల మంది గ్రామీణ ఓటర్లున్నట్లు తెలుస్తోంది.మూడు విడతల ఓటింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందనిఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. మధ్యాహ్నం నుంచి కౌంటింగ్ మొదలెడతారు. ఉమ్మడి పాలమూరు జిల్లాల సర్పంచు స్థానాలను పరిశీలిస్తే మహబూబ్‌నగర్- 441, నాగర్‌కర్నూల్-461,నారాయణపేట-280,వనపర్తి-268, జోగులాంబ గద్వాల-255లకు సర్పంచు పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.ఒక్కో పంచాయతికి 10 నుంచి 15 వరకు వార్డు సభ్యులుంటారు. భూత్పూర్ మండలంలో 19 జీపీలు, 174 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గౌరవం

### మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జిఎంఆర్
### దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం



మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కును అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, నవంబరు25 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గౌరవం దక్కిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ లో ఏర్పాటు చేసిన దేవరకద్ర, కౌకుంట్ల, మండలాల ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా రాష్ట్రం, దేశం, కూడా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి మహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ స్పూర్తితో ఉక్కు మహిళగా ఎదగాలని కోరారు. రాజీవ్ గృహ, ఇందిరమ్మ పేరిట ఇల్లు పేదలకు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫునసారీ పెట్టి, గౌరవించాలని ఉద్దేశంతో కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతోపాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు చీర ఇస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలియజేశారు.అనంతరం దేవరకద్ర నియోజకవర్గ మహిళా సంఘాలకు రెండు కోట్ల 95 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కును మహిళా సంఘాలకు అందజేసి,తదనంతరం ఆశ వర్కర్లను యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల ఏపిఎం సునీత, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు నర్మద, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజేషన్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస రావు,తాహసిల్దార్ దీపిక, డా. శరత్ చంద్ర, దేవరకద్ర పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి,లక్షీకాంత్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బీరప్పయ్య చైర్మన్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, గుడిబండ అమరేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గద్దె గూడెం పూర్ణిత, గోపన్ పల్లి శ్రీకాంత్ రెడ్డి, కౌకుంట్ల యువజన అధ్యక్షులు నరేష్, పుట్టపల్లి చెన్నకేశవులు, గోపన్ పల్లి పకీరప్ప, రాంబాబు, గూరకొండ మాజీ సర్పంచ్ ఉషనప్ప, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు,



ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే



ఆశ వర్కర్లకు యూనిఫార్మ్స్ అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే



సమావేశానికి హాజరైన మహిళలు

# పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం
- ఉదండాపూర్ నిర్వాసిత పనులపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్25 ప్రభాతవార్త:** ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మిషన్ భగీరథ, సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్,గ్రామ పంచాయతీ భవనం, పార్కులను, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్ భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించే స్థలంలో వసతుల కల్పనలో భాగంగా నిర్మిస్తున్న పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి తగు సూచనలు ఇచ్చారు. నిర్మాణ పనులను త్వరితగతిన ఎటువంటి అలసత్వం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా,ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్,ఆర్డీవో నవీన్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు,

# మార్కెట్లో పేరుకుపోతున్న మొక్కజొన్న ధాన్యం

### ధాన్యం తూకం చేయడానికి కాంటాలు, హామాలీలను పెంచాలని రైతుల వినతి



లింగాల మార్కెట్లో పేరుకుపోయిన మొక్కజొన్న ధాన్యం

**లింగాల, నవంబరు25 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని సింగిల్ విండో ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న ధాన్యం రోజు రోజుకు పేరుకుపోతుంది. వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు లేవని పలువురు రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రంలో తూకం చేయడానికి కాంటాలు రెండు మాత్రమే ఏర్పాటు చేయడం వల్ల ఆలస్యం అవుతుందని రైతులు మండిపడుతున్నారు. మొక్కజొన్న ధాన్యం మాత్రం విపరీతంగా కొనుగోలు కేంద్రానికి వస్తుందని, హామాలీలు సక్రమంగా తగినంత లేకపోవడం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే నిలిచిందని రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొంతమంది రైతుల నుంచి కొనుగోలు చేసి తూకం చేసిన ధాన్యం మార్కెట్‌లో ఉంచారు. కానీ లారీలు మాత్రం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగాల మార్కెట్లో తూకం చేసిన మొక్కజొన్న ధాన్యం దాదాపుగా 20 వేల క్వింటాళ్లు పై చిలుకు మొక్కజొన్న ధాన్యం ఉంటుందని వాపోతున్నారు. చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

**కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలకు ఎత్తాలి**



గత 20 రోజుల క్రితం కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలకు ఎత్తకుండా మార్కెట్లోనే ఉంచారు. త్వరగా లారీలకు రంపించి మొక్కజొన్న ధాన్యాన్ని ఎత్తాలని,దాని కాపలా ఉంటూ రాత్రి సమయంలో చల్లికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– సాడమోని లక్ష్మయ్య, రైతు.. కొత్తకుంటపల్లి

**త్వరగా ధాన్యాన్ని లారీలకు ఎత్తే ప్రయత్నం చేస్తాం..**

**– పాండు, సిఈఓ లింగాల.**

మార్కెట్లో మొక్కజొన్న ధాన్యం పేరుకుపోతున్న విషయం వాస్తవమే. కానీ ధాన్యం లారీలకు రెండు రోజుల క్రితం లోడ్ చేసి పంపించాము.లారీలకొరత,ఇటు హామాలీల కొరత తీవ్రంగా ఉంది.రెండు,మూడు రోజులలో లారీలను రప్పించి ధాన్యం లోడ్ చేసి పంపిస్తాం. తూకం చేయడానికి కాంటాలు అదనంగా ఏర్పాటుచేస్తాం.హామాలీలు లేకపోవడంవల్ల కాంటాలు ఏర్పాటు చేయలేదు. తూకం చేయడానికి అదనంగా ఏర్పాటు చేస్తాం.

## ధ్రువపత్రాలు త్వరగా జారీ చేయుటకు మార్గాలను అన్వేషించాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 25,ప్రభాతవార్త:** మీసేవ కమిషనర్ రవికిరణ్, మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.సి.,ఎస్.టి., బి.సి,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా కలెక్టరేట్లో మంగళవారం సమావేశమై పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్,ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ అప్లై చేసుకొనుటకు ఈపాస్‌లో సులభతరంగా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు, ఆదాయం, కుల ధృవీకరణ మరియు ఇతర ధ్రువపత్రాలు మీసేవలో త్వరగాజారీ చేయుటకు వేగవంతమైన మార్గాలను అన్వేషించాలని చర్చించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఈపాస్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సులభమైన మార్గాలను నిర్దేశించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి సునీత, షెడ్యూల్ తెగల అభివృద్ధి అధికారి జనార్ధన్, బిసి మరియు మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి ఇందిరా,సంబంధిత అధికారులు ఉన్నారు.



## ద్విచక్ర వాహన చోదకుల నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్

### మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేని ప్రయాణాలపై
### డీఎస్పీ వెంకటేశ్వర్లు అవగాహన - కౌన్సిలింగ్ నిర్వహణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 25,ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు మహబూబ్నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడింది. ఈ డ్రైవ్‌లో ఇన్స్పెక్టర్ ఇజజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొని మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ వంటి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని గుర్తించి.ఈ కార్యక్రమంలో మొత్తం 35 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాహనాలు నడిపిన మైనర్లను వారి తల్లిదండ్రులతో కలిసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం డిఎస్పి వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని మైనర్లకు మరియు తల్లిదండ్రులకు వివరించారు.ఈసారి కేసులపై ఫైన్ విధించి ముగిస్తున్నట్లు, ఇకముందు ఈ తరహా నిబంధనల ఉల్లంఘన కనిపిస్తే వాహనాలను సీజ్ చేసి, లైసెన్స్ రద్దు చేసే చర్యలు తీసుకోబడతాయని డిఎస్పి తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతదృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మైనర్లకువాహనాలు అప్పగించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

